క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో మాల శ్రీనివాస్ కుటుంబానికి గురువారం స్నేహితులు రూ. 70 వేలు ఆర్థికసాయం అందజేశారు. మాల శ్రీనివాస్ హఠాన్మరణం చెందడం వలన తన చిన్ననాటి పాఠశాల స్నేహితులు అందరూ కలిసి రూ.70 వేలు జమచేసి బాధిత కుటుంబానికి చెక్కు రూపంలో అందించారు. దీనికి సహకరించిన బీఆర్‌ఎస్ నాయకుడు పెద్దింటి వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వనపర్తి టౌన్: పట్టణంలోని 15, 22వ వార్డులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 31 మంది యువకులు గురువారం మాజీ మంత్రి చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపరిచేందుకు బీఆర్‌ఎస్‌ను వీడినట్లు యువకులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాములు, నాయకులు జనార్దన్, గోర్ల జాన్, మెంటపల్లి రాములు, ఎల్లయ్య. ప్రవీణ్, అక్షయ్, ఇర్ఫాన్, అఫ్రోజ్, అసన్, మోసిన్, హుస్సేన్, హరీఫ్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూర్: ద్విచక్ర వాహనాన్ని తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన గురువారం రాత్రి పిన్నంచర్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా ధరూర్‌కు చెందిన నాగేంద్రం ద్విచక్రవాహనంపై ఆత్మకూర్ వస్తుండగా పిన్నంచర్ల సమీపంలో ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని పరిశీలించిన వైద్యులు కోమాలోకి వెళ్లాడని పరిశీలించారు. అనంతరం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

10న లోక్ అదాలత్

కోడేరు: కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని ఈనెల 10న నేషనల్ లోక్ అదాలత్ ఉంటుందని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. రాజీ చేసుకున్న ఇరువర్గాల వారు ఈనెల 6 నుంచి 10వరకు సంబంధిత పోలీసుస్టేషన్‌లో హాజరు కావాలని కోరారు.

సాయినాథుడికి పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పూజలు, మంగళహారతిలో పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీసేవా, భజనకీర్తనలతో పలు కార్యక్రమాలు చేపట్టారు.

హరిత హోటల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



కొల్లాపూర్: సోమశిల గ్రామంలోని హరితహోటల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బీసీ సంక్షేమసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పర్యాటకశాఖ నిధులతో నిర్మించిన హరితహోటల్‌ను నిరుపయోగంగా ఉంచడం వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోటల్ ప్రాంగణం చెత్తకుప్పలకు, మద్యం సీసాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి, పర్యాటకులకు భోజన వసతులు అందేలా చూడాలని ఆయన కోరారు.

కుటుంబసభ్యుడిని కోల్పోయాం

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్ల చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బీరం రాజారెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి ఎంతో కృషి చేసిన రాజారెడ్డి మృతి పార్టీని తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. అంతిమయాత్రలో పాడె మోశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులైన 31 మందికి కొల్లాపూర్‌లో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పాండూనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో ఈ చెక్కులను అందజేస్తారని, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.



ఆగారంలో..



అప్పారెడ్డిపల్లిలో..



పామిరెడ్డిపల్లిలో బతుకమ్మలతో ఊరేగింపు చేస్తున్న ప్రజలు

నెర్రెలు వారిన నేలపై జలసిరులు

సాక్షి, నెట్‌వర్క్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి కష్టాలు తీరి పుష్కలంగా పంటలు పండిస్తున్న అన్నదాతల కళ్లలో ఆనందం చూస్తున్నామని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఊరూరా చెరువుల పండుగను సంబురంలా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు చెంతనే కృష్ణమ్మ పరుగులు పెడుతున్నా.. ఉమ్మడి జిల్లా కరువు కోరల్లో అల్లాడిందని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఊరూర చెరువులు నిండి జలసిరులు చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని మహిళలు బతుకమ్మలు ఆడి తెలంగాణ సంస్కృతిని చాటారు. మత్స్యకారులు వలతో ర్యాలీ చేసి చెరువులకు పూజలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్లు చక్రపాణి సంధ్య, చాంద్‌పాషా, అబ్రహం లింకన్, ఎంపీడీఓలు నాగేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అఫ్జల్, కతలప్ప, ఏఓ సాజీద్, విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీపీలు మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బంగారు శ్రీను, కమలేశ్వర్‌రావు, ఆవుల శైలజ, జెడ్పీటీసీలు లక్ష్మి, పద్మ, పీఆర్ ఈఈ మల్లయ్య, ఏపీఓ కుర్మయ్య, పీఆర్ ఏఈ సత్తయ్య, డీటీ లక్ష్మీకాంత్, మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, గాయత్రి, మంగమ్మ, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కర్రె స్వామి, జీఎస్ గోపి, కమిషనర్లు ఆదిశేషు, మహమ్మద్ ఖాజా, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు పాల్గొన్నారు.



పెద్దమందడిలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, అధికారులు



తెల్లరాళ్లపల్లిలో..



నర్సింగాపురంలో..



పెబ్బేరులో..



తుక్యానాయక్ తండాలో..



ఆత్మకూర్ బతుకమ్మ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



కల్వరాలలో..



అమరచింతలో..



దొడగుంటపల్లిలో..

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



తెల్లరాళ్లపల్లితండాలో బడిబాట ర్యాలీ



అమరచింతలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన చేపడుతున్నామని ఎంఈఓ భాస్కర్ సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. గురువారం విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలకు రాకుండా బడి బయట ఉన్న వారు 42 మంది చిన్నారులను గుర్తించామని తెలిపారు. అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది తమ పిల్లలను బలవంతంగా కూలీ పనులకు పంపిస్తున్నారని, చిన్నారి చదువుకు ఏ ఖర్చు లేకుండా ప్రభుత్వమే పుస్తకాలు, దుస్తులు, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు.

అమరచింత: ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు ముందున్నారని డీఎంఆర్‌ఎం పాఠశాల హెచ్‌ఎం బాలస్వామి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఆయా కాలనీల్లో బడి ఈడు పిల్లల కోసం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రైవేట్ బడుల్లో ఆర్భాటం ఎక్కువ చదువు తక్కువ అని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీటీ కిరణ్, భాస్కర్ పాల్గొన్నారు.

పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని పాఠశాలల హెచ్‌ఎంలు తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, తెల్లరాళ్లపల్లి, వెంగళాయిపల్లి, చింతకుంట, దావాజిపల్లి, పాన్‌గల్ తదితర పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకురుచెట్టు, ముందరితండా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం ఎంపీడీఓ అఫ్జల్, పంచాయతీరాజ్ ఏఈ రాజేష్ భూమిపూజ చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీ భవనం నిర్మించేందుకు రూ.26లక్షలు చొప్పున నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్‌లు రాధాకృష్ణ, జయంతి, ఉప సర్పంచ్ రమేష్, గోపాల్‌నాయక్, నాయకులు గోవింద్, మోహన్, పూల్యానాయక్ ఉన్నారు.

పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని షాబాద్ నుంచి చాగాపురం వరకు రూ. కోటి ఐదు లక్షల వ్యయంతో రెండు కిలో మీటర్ల వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నారన్నారు.

రోడ్డు కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకోండి

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామం మీదుగా మద్దూరు వరకు ఉన్న లింకు రోడ్డును కబ్జా చేసిన రైతు సద్దల బాలకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురువారం కొంకన్‌వానిపల్లి సర్పంచ్ వెంకటన్నతో కలిసి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా తమ గ్రామం నుంచి చిన్నచింతకుంట మండలం మద్దూరు గ్రామానికి రహదారి ఉందని సర్పంచ్ వెంకటన్న తెలిపారు. సద్దల బాలకృష్ణారెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న రోడ్డును జేసీబీతో పూడ్చి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రెండు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని, రహదారిని ఆక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారిని ఆక్రమించిన వ్యక్తి గురించి మద్దూరు సర్పంచ్‌కు విన్నవిస్తామని అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్‌కు రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



రహదారిని ఆక్రమించచన ప్రదేశంలో ఆందోళన చేస్తున్న కొంకన్‌వానిపల్లి గ్రామస్తులు

ప్రజా హామీలను నెరవేర్చాలని ఆందోళన



ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అమరచింత: ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రభుత్వ పనితీరుకు నిరసనగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది ఏం లేదన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం దీక్షదీవాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల పేరిట సంబరాలను నిర్వహించుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును పార్టీ ప్రచారానికి వాడుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు.

హామీలు అమలు ఏమాయే..

సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 12 రకాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఉన్న వారందరికీ ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు, అర్హులకు కొత్త రేషన్ కార్డులు, పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, దళితులకు మూడెకరాల భూమిని ఇవ్వాలని కోరారు. నిరుద్యోగులకు నెలకు రూ.పది వేల భృతిని చెల్లించాలన్నారు. చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల కోసం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రిని మండల కేంద్రంలో నిర్మించాలన్నారు. బీడీ కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఆస్పత్రి సామర్థ్యాన్ని పెంచాలని, మహిళా డాక్టర్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషాకు అందించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, రాజు, రాజన్న, సామేలు, కురుమన్న, మన్యం, వెంకటేష్, శ్రీను, నాగరాజు, లక్ష్మి, రూప, సలోమి, సుశీలమ్మ పాల్గొన్నారు.

రోడ్లపై సంతలతో ఇబ్బందులు



పాన్‌గల్‌లో రోడ్డుపైనే కొనసాగుతున్న సంత (ఫైల్)

- సౌకర్యాల కొరత
- అవస్థలు పడుతున్న ప్రజలు
- స్థలాల కేటాయింపుపై దృష్టి సారించాలంటున్న మండల ప్రజలు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జరుగుతున్న వారాంతపు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తుండటంతో వాహనదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, రేమద్దుల, శాగాపూర్‌తో పాటు మరికొన్ని గ్రామాల్లో వారాంతపు సంతలకు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారు. సంతలకు ప్రత్యేక స్థలాలు లేక చాలా వరకు ఆరు బయట, ప్రధాన రోడ్లపైనే నిర్వహిస్తుండటంతో ఆయా రోడ్లపై వచ్చిపోయే వాహనాలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల సంతల నిర్వహణ కోసం ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తున్నా.. వాటిని అభివృద్ధి చేయక పోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామాల్లో ప్రధాన రోడ్లపైనే సంతల నిర్వహణ కొనసాగుతుండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారాంతపు సంతల నిర్వహణ రోజు ఆయా రోడ్ల ద్వారా వాహనాలు వెళ్లడం కష్టంగా మారుతుంది. వారాంతపు సంతల నిర్వహణను తైబజారు దక్కించుకున్న వారికి ఎంతో కొంత ఆదాయం లభిస్తున్నా ప్రత్యేక స్థలాల కేటాయింపు గాని, వసతుల ఏర్పాటుపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ వారు కానీ స్పందించి వారంతపు సంతలకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.



రేమద్దులలో..

సమస్యలు పరిష్కరించాలి



గ్రామాల్లో వారాంతపు సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాలు కేటాయించడంతో పాటు వసతుల ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రోడ్లపై సంతల నిర్వహణతో రాకపోకలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– కళావతమ్మ, మాజీ ఎంపీటీసీ, కేతేపల్లి

దృష్టి సారించాలి



గ్రామాల్లో వారాంతపు సంతలకు ఆయా పంచాయతీలు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక స్థలాలు కేటాయింపునకు చర్యలు తీసుకుంటే ఇబ్బందులు తొలుగుతాయి. ఏళ్లుగా రోడ్లపైనే వారాంతపు సంతల నిర్వహిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఆంజనేయులు, డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు, రేమద్దుల

చర్యలు తీసుకుంటాం



మండలంలో గ్రామాల్లో వారంతపు సంతలు రోడ్లపైన నిర్వహణతో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. ఈ విషయంపై ఆయా గ్రామాల సర్పంచ్‌లతో చర్చించి ప్రత్యేక స్థలాల గుర్తించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ, పాన్‌గల్

రెండు రోజులుగా ఆలయం మూసివేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయంలోని గర్భగుడిలో స్వామివారి దర్శనం రెండు రోజులుగా భక్తులకు కరువైంది. చిట్యాల రహదారిలోని ఈ ఆలయం ప్రతి రోజు ఉదయం 6, 7 గంటల మధ్యలో తెరిచి స్వామి వారిని జలంతో శుద్ధి చేస్తారు. కానీ రెండు రోజులుగా (బుధవారం, గురువారం) గర్భగుడి పూర్తిగా మూసుకొని ఉండటం, పారిశుధ్య కార్మికులు ఆలయ పరిసరాలను ఊడ్చి.. ఆలయ ప్రధాన తలుపును తెరిచి వెళ్తుండడంతో భక్తులకు స్వామి వారి అసలు దర్శనం లభించడం లేదు. దీంతో భక్తులు ప్రదర్శనలు చేసి, బయటి నుంచే మొక్కి వెళ్తున్నారు. ఇప్పటికైనా నిత్యం తమకు స్వామి దర్శనభాగ్యం కలిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈఓ శేఖర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. చింతల హనుమాన్ ఆలయ గర్భగుడిని తెరవకపోవడంపై విచారణ చేస్తామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోమారు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మూసి ఉన్న చింతల ఆంజనేయస్వామి గర్భగుడి

అన్ని గ్రామ పంచాయతీలకు పక్కాభవనాలు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి పక్కా భవనాలను మంజూరు చేశామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని షాపురంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 500 జనాభా కలిగిన ప్రతి గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సర్పంచు బాలాంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.